# సహగమనము

శ్రీ యం. రామజోగారావు గారు

కృష్ణపురమును హిందూదేశపు వెనీసునగరముగ తలంపవచ్చును. గ్రామము చిన్నదైనను, కృష్ణాస్రవంతీమధ్య నుండుటంజేసి కడుంగడు రమ్యముగ నుండును. చుట్టుప్రక్కల నుండెడి యేగ్రామమునకు పోవుదమన్నను కృష్ణను తెప్పలపై దాటి పోవలెను. వెనీసు నగరమునలేని సౌందర్యములలో నొకటి కృష్ణపురమున నెక్కుడుగ నున్నది. కృష్ణావగ యీప్రాంతములందు పర్వతప్రదేశములనంటి పోవుచుండును. రెండు మూడు మైళ్ల లోపున నేవైపుజూచినను పర్వత దృశ్యము మనోరంజకముగ నుండును. నిరంతర నీలవర్ణముచే నొప్పెడి యీదృశ్యమును వివిధ సమయములందు జూచియే తీరవలెను గాని వర్ణించినను పారము ముట్టదు.

కృష్ణపుర మొకపురాతన గ్రామము. బ్రాహ్మణ గృహము లాయూర మెండు. గ్రామమధ్యమున తటాకము. దానినంటి పురాణ ప్రసిద్ధమైనను సుస్థితిలోనున్న సూర్యనారాయణమూర్తి దేవాలయము పల్లెటూరియందము నినుమడింప జేయుచుండును. ఆయూరిలోని బ్రాహ్మణు లందఱును పండితులు. వేదాధ్యయన రతులు. ఆధునిక పద్ధతి ననుసరించి యాంగ్లవిద్య నభ్యసించినను విద్యార్థులు తమతమ యాచార వ్యవహారములను వీడలేదు. ఆంగ్లసాహిత్యము దారితేరిన వారైనను తమ యాచార వ్యవహారములను వీడలేదు. తమసాహిత్యము ప్రపంచములో నెల్లసాహిత్యములకంటె మిక్కిలి ప్రాచీనమైనదనియు, సత్యోత్తమమైనదనియు దృఢమగు నమ్మకము గలవారు. పురాణములను శోధించి, ఆదిమకాలమునుండి యాధునిక సమయము వఱకు ఇతిహాసమును, ఖగోళశాస్త్రమును సమగ్రముగ వ్రాసిన పండితాగ్రేసరులా గ్రామమున ననేకులుగలరు. మంత్రాది వివిధశాస్త్రములను పరిశోధించి యనేకయంత్రములను కనిపెట్టగల్గు శాస్త్రవేత్తలు పెక్కురాపురమున నున్నారు. ఆచార వ్యవహారముల ననుసరించుటలో ప్రవరుని నిరసించు బ్రాహ్మణు లనేకులాజానపదమున రాజిల్లుదురు. అగ్రజాతి తమతమ ధర్మములను వీడక ప్రాచీన కాలమునుండి వరలుచున్నదనిన, మిగిలిన మూడుజాతులవారు తమతమ ధర్మపథముల నడుచు చున్నారనిన నతిశయోక్తి కానేరదు. వేయేల! ఆకృష్ణపురము ప్రాక్పశ్చిమనాగరికతాసారమును జీర్ణించుకొని స్వర్గసుఖముల ననుభవించుచుండును.

కృష్ణపుర మీదిన మంతయు శూన్యముగ నుండెను. గ్రామములో మచ్చునకొక్క వ్యక్తి యైనను లేదు. ఉన్న కొందఱునుకూడ గ్రామమున కనతి దూరమునన్న

స్మశానము వైపు పరుగెత్తు చుండిరి. స్మశాన ప్రదేశమున నెక్కడ జూచినను హాహాకారములు నింగి ముట్టు చుండెను. గ్రామ మంతయు విశాల వటవృక్షము క్రింద చేరినది. వటవృక్షమున కనతి దూరమున నొక పెద్ద చితిపేర్చబడి యుండెను. దానిపై నొక నవయువకుని కళేబరము పరుండ బెట్టబడి యుండెను. దాని ప్రక్కగ పాతిక సంవత్సరముల వయస్సుగల యొక సుందరాంగి సర్వాభరణ భూషితయై కూర్చుండి యుండెను. సువర్ణ చ్ఛాయగల దేహమునకు తెల్లని చీర యొక విధమగు శోభ గూర్చుచుండెను. విశాలములగు నేత్రము లంజనము లేమిచే మిగుల శోభిల్లుచుండెను. శిరస్సున పాపట బిందిరీలు, పసుపు పూసిన ముఖముపై కుంకుమబొట్టు, మెడలో కాసులపేరు, కంటె, పాదముల కంటెలు, కడియములు గలిగి యాయువతి సీతయో సావిత్రియో యననొప్పుచుండెను. చితి ముట్టించ బడెను. గ్రామాధికారులు కాగితములను కలములను గైకొని సమీపమున నిలచి యుండిరి. ఆసుందరి లేచి చితికి మూడు ప్రదక్షిణములు గావించి యిట్లు పల్కెను. "నాకీ ప్రపంచమున నాపతి కంటె వేఱు దైవముగాని, దిక్కుగాని లేదు. ఆతడు నన్ను, నేనాతని మిక్కుటముగ ప్రేమించు కొనుచుంటిమి. అతడులేనిది నాకీలోకమున నుండు టనవసరముగాన నేనాతని యనుసరింప నాయుసురులను వీడుచున్నాను. ఇట్లు సతియగు నాచారము ప్రస్తుత పద్ధతుల ననుసరించి న్యాయ విరుద్ధమైనను, నాయంగీకారముపైననే నేను నాపతి ననుసరించుటకు ప్రాణత్యాగము గావించుచున్నాను." ఇంతలో నాల్గువైపుల నుండియు అగ్నిజ్వాల లావరించుచుండెను. గ్రామాధికారు లేమిచెప్పుటకును చేష్టదక్కి యాసతి వాఙ్మూలమును మాత్రము వ్రాసికొనిరి. ఆయువతి మఱల త్రివారప్రదక్షిణము గావించి మోడ్పుహస్తములతో దహనముగానున్న పతికళేబరము చెంత శాంతచిత్తముతో కూర్చుండి పోయెను. ప్రేక్షకుల నయనములు బాష్పపూరితములై పోయెను. పతివ్రతాతిలకముల నీమె మించి పోయెనను ధ్వను లెల్లెడలనుండి వినవచ్చుచుండెను. అర్ధగంటలో చితి భస్మమయమై పోయెను. ఎద్దియో పోగొట్టుకొనినవారివలె చేష్టలుదక్కి యెచ్చటివార లచ్చటకుపోయిరి. గ్రామోద్యోగు లీ 'సతి' సంగతి, యామె వాఙ్మూలమును తాలూకాకచ్చేరికిని, దండనాధికారులకును వ్రాతమూలముగ నెఱింగించిరి.

కృష్ణశాస్త్రి వంశసంప్రదాయముల బ్రసిద్ధికెక్కిన పండితకుటుంబమున జన్మించెను. మంచి సంస్కృత భాషాజ్ఞానము గలవాడు. ఆంగ్లభాషలో యం. ఏ. యందు కృతార్థుడు. విశేషించి యాంగ్లభాష నభిమానవిషయముగ చదువుటచే పశ్చిమఖండ వాసుల యాచారవ్యవహారముల నామూలాగ్రముగ గ్రహించెను. కాని సంస్కృత సాహిత్యమునుగూడ మధించిన వాడును, స్వతఃసిద్ధముగ భారతీయ బ్రాహ్మణుడును

అగుటచే సనాతనవైదికధర్మపుటాచారముల ననుకరించెను. పాశ్చాత్యవిద్య యాతనిపై తనప్రభావమును జూపలేక పోయెను. ధనికుడగుటచే కృష్ణశాస్త్రి యుద్యోగమున కాసింపక గ్రంథపఠనముననే కాలక్షేపము జేసికొనుచు నింటనే యుండి పోయెను. త్రికాల సంధ్యావందనము, జపము, నిష్ఠ, నియమము గలవాడాతడు. ఆతని జూచినవారలెవరు ఆత డాంగ్లవిద్యాపారంగతుడని యనుకొనరు. మాతాపితృసేవా తత్పరుడైన కృష్ణశాస్త్రి యింటనేయుండి వారికి సపర్యలుగావించుచు, వారి ప్రేమానుగ్రహములకు పాత్రుడగుచుండెను.

రుక్మిణీదేవి, కృష్ణశాస్త్రి భార్య; భర్తవలెనే మంచి సంస్కృతజ్ఞానముగలది. ఆమె యాంగ్లవిద్య నభ్యసింపలేదు గాని అనురూపుడును, విద్యాధికుడునగు పతి సాహచర్యమువలన యాతనినుండి యాధునిక జ్ఞానమును సంపాదించినది. వార్తాపత్రికలను, మాసపత్రికలను చదివి తన తెలివితేటలను నిరంతరము వృద్ధిగావించుకొనుచుండెను. స్వతఃసిద్ధముగ స్త్రీ విశేషించి భర్తను ప్రేమించి, యాతనినే తనదైవముగ నమ్మినదామె. అతనిని ప్రతివిషయమున ననుసరించి యుండెడిది. పతికి నచ్చిన సతి. సతికి నచ్చిన పతి. వారి యభిప్రాయములకు మధ్య నేవిధమైన తిరస్కరిణియునులేదు. ఇక వారి దాంపత్య సౌఖ్యమును గూర్చి వేఱే చెప్పవలయునా? గ్రామములోని నవయువకులకు, యువతులకును వా రాదర్శదంపతులు. భవభూతిరచిత దాంపత్యము వీరియనురాగమునకు దిగదుడుపు. అట్టి దంపతులలో నేయొకరు గతించినను రెండవవా రనుసరించుటలో నతిశయోక్తి, అస్వభావికము నెంతమాత్రము నుండవు.

సహగమనపు పద్ధతి అక్బరుకాలములో నైననేమి, విలియం బెంటిక్ ప్రభువు సమయమున నైననేమి భారతదేశమున సంతరించి పోయినది. ప్రస్తుత మిరువదవ శతాబ్దమున దానిపేరుకూడ నెఱుగనివార లనేకులుగలరు. అనేక యువతులు బలవంతముగ సహగమనము చేయింప బడుచుండుటచే సున్నిత హృదయముగల అక్బరున కీయాచారము చాలవఱకు క్రూరముగ గన్పట్టినది. అందుచేతనే యాతడు దానిని మాన్పుటకెన్నియో ప్రయత్నములను గావించి చివఱకు కొంతవఱకు కృతకృత్యు డయ్యెను. ఆంగ్లపరిపాలన మారంభమైన తరువాతకూడ యీయాచార మున్నట్లు కన్పట్టుచున్నది. బెంటిక్ ప్రభువు చట్టమును నిర్మించి సహగమనము చేసినవారిని, ఆ విషయమునకు చేయూత నొసంగిన వారినికూడ శిక్షింప ప్రారంభించెను. అప్పటినుండియు నీయాచారము క్రమక్రమముగ క్షీణించి తుద కంత మొందినది. గ్రామోద్యోగస్థు లెచటనైనను సహగమనము జరిగినచో ప్రభుత్వమువారికి తెలుపవలెనను నిర్బంధముండుటచే కృష్ణపుర గ్రామోద్యోగస్థులుకూడ రుక్మిణీదేవి వాఙ్మూలముతో కూడ 'రిపోర్టు'చేసి పోలీసు వారికి విషయము నెఱింగించిరి.

(సశేషము)